## బోనాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి

**బోడుప్పల్:** బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్ రెడ్డి సూచించారు. మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆలయ చైర్మన్లు, ఆర్గనైజర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పలహార బండి ఊరేగింపు, తొట్టెలు తీసేవారు ముందుకు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

## అమ్మవారి తొట్టెల ఊరేగింపు



ఊరేగింపులో కార్పొరేటర్లు శ్రీవాణి, రజిత, శ్రీదేవి

**ఉప్పల్:** ఉప్పల్ మహంకాళి అమ్మవారి తొట్టెలు, పలహార బండ్ల ఊరేగింపు శుక్రవారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరేగింపులో విజయవాడ నుంచి వచ్చిన కళాకారులు, పలు దేవతామూర్తుల వేషాధారణతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వీరితో పాటు కాశీ నుంచి వచ్చిన అఘోరాల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## ధూమపానంపై అవగాహన



**అల్వాల్:** అల్వాల్ పల్లవి ప్రొగ్రెసివ్ స్కూల్ వద్ద పాఠశాల చైర్మన్ మాధవరెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణలతరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ధూమపానంపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధూమపానానికి దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, ప్రభాకర్, నైనిక, వసంత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి పుష్పాలంకరణ



**బోడుప్పల్:** శ్రావణ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవి అమ్మవారికి పుష్పాలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. మహిళలు లలితా పారాయణం చేస్తూ అమ్మవారికి పుష్పాలంకరణ చేశారన్నారు. అనంతరం భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శులు అశోక్‌కుమార్, శ్రీనివాస్, నకాష్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిచర్ల శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు చంద్రశేఖర్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.


## మధ్యాహ్న భోజనం ప్రారంభం



అన్నం వడ్డిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

**కుషాయిగూడ:** పెద్ద చర్లపల్లిలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భోజనం వడ్డించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పేదలకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, రాజుగౌడ్, భాను చందర్, భరత్‌రాజ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న సీఐ



**పోచారం:** అన్నోజిగూడలోని డీమార్ట్ వద్ద బైక్ పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన వ్యక్తిని పోచారం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజు వర్మ కాపాడారు. అపస్మారక స్థితిలో రోడ్డుపై పడిపోయిన బాధితుడిని ఆయన స్వయంగా తన వాహనంలో ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించినందుకు స్థానికులు సీఐని అభినందించారు.

# ఎఫ్ఆర్ఎస్

**ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ షురూ**

- మొదటి రోజు కాస్త సర్వర్ డౌన్
- ఆలస్యమైనా..సక్సెస్‌ఫుల్‌గా యాప్ ద్వారా హాజరు నమోదు

**కాప్రా:** పాఠశాలలకు రాకుండా.. విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించకుండా విధులకు డుమ్మా కొడుతున్న ఉపాధ్యాయులను గాడిన పెట్టేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన (ఎఫ్ఆర్ఎస్) ఫేజ్ రికగ్నేషన్ అటెండెన్స్‌ను పాఠశాల విద్యాశాఖ శుక్రవారం నుంచి ప్రారంభించింది. ఏఐ సాంకేతికతో పనిచేసే ఈ యాప్‌ను 2023లో పాఠశాల విద్యాశాఖ రూపొందించింది. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు కోసం రూపొందించి అప్పటి నుంచే స్టూడెంట్ల హాజరును యాప్ ద్వారా నమోదు చేస్తున్నారు. తాజాగా ఉపాధ్యాయుల హాజరును సైతం ఈ యాప్ ద్వారానే నమోదును ప్రారంభించింది. ఇందులో భాగంగా కాప్రా సర్కిల్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు తమ మొబైల్‌లో యాప్ ద్వారా అటెండెన్స్ నమోదు చేసుకోగా మొదటిరోజు పలు సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. అయితే కాస్త సమయం తీసుకుని కాప్రా జడ్పీ స్కూల్‌లోని మొత్తం 29 మంది టీచర్లు తమ హాజరును యాప్ ద్వారా నమోదు చేసుకున్నారు.



కాప్రా జడ్పీ స్కూల్‌లో ఉపాధ్యాయుడి రిజిస్ట్రేషన్ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌బాబు

### స్కూల్ ఆవరణలో ఉంటేనే లాగిన్

ఉపాధ్యాయులు స్కూల్ ఆవరణలో ఉంటేనే ఈ యాప్ లాగిన్ అవుతుంది. ముందుగా ప్రతి ఉపాధ్యాయుడు వారి మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న యాప్ ద్వారా ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయుడి ద్వారా రిజిస్ట్రేషన్ నమోదు చేస్తారు. తర్వాత సదరు ఉపాధ్యాయుడి ఎంప్లాయీ ఐడీతో యాప్‌లో లాగిన్ అవుతారు. జియో ట్యాగింగ్ ఉండడంతో స్కూల్ ఆవరణలో ఉంటేనే లాగిన్ అయ్యేందుకు అవకాశం ఉంటుంది. తిరిగి సాయంత్రం అదే స్కూల్ ఆవరణలో ఉంటేనే లాగౌట్‌కు అవకాశం ఉంటుంది. దీంతో ఇప్పటి వరకు బడి ముఖం చూడని కొందరు ఉపాధ్యాయులను ఇకపై కట్టడి చేయవచ్చని పలువురు భావిస్తున్నారు.

### ఆలస్యమైనా.. సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేశాం..



కాప్రా జడ్పీ స్కూల్‌లో ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ మొదలైంది. మొదటి రోజు యాప్ ద్వారా హాజరు నమోదులో కొంత ఆలస్యమైంది. స్కూల్లోని మొత్తం 27 మంది ఉపాధ్యాయుల్లో మొదటి 2 గంటల్లో 15 మంది టీచర్లు హాజరు నమోదు చేసుకున్నారు. తర్వాత యాప్ కాస్త నెమ్మదించడంతో ఆలస్యమైనా మధ్యాహ్నం వరకు పూర్తి స్థాయి సిబ్బంది తమ హాజరును యాప్ ద్వారా నమోదు చేసుకున్నారు.

–శ్రీనివాస్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు, కాప్రా జడ్పీ స్కూల్

### మొదటి రోజు కాస్త ఇబ్బంది..



ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో హాజరును నమోదు చేసుకున్నాం. మొదటి రోజు కావడంతో ఉదయం సర్వర్ డౌన్ అని చూపించింది. తర్వాత అందరం యాప్ ద్వారా అటెండెన్స్ నమోదు చేసుకున్నాం. అటు విద్యార్థుల హాజరుకు కూడా సర్వర్ డౌన్ అని చూపిస్తూ ఆలస్యమైంది. మొదటి రోజు కావడంతో కాస్త ఇబ్బంది అనిపించినా.. రెండురోజుల్లో అన్ని సమస్యలు తొలిగిపోయి ఈజీగా ఎన్‌రోల్ అవుతుందని అనుకుంటున్నాం.

– రాజగోపాల్, ఉపాధ్యాయుడు, కాప్రా జడ్పీ స్కూల్

## రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి



ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

**మౌలాలి :** రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మౌలాలి డివిజన్ సౌత్‌సుధానగర్ కాలనీ వాసులు కోరారు. ఈమేరకు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుధానగర్‌లోని చర్చి రోడ్డు సుమారు 100 మీటర్ల మేర పూర్తిస్థాయిలో గుంతలు పడి అధ్వానంగా మారిందని, దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే నిధులు మంజూరు చేసి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ప్రతినిధులు బాబు, మహాలక్ష్మి, లలిత, బీఆర్ఎస్ నాయకులు వంశీ ముదిరాజ్, మహ్మద్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## 'బీసీలపై కాంగ్రెస్‌ది కపట నాటకం'



ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

**మల్లాపూర్:** బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కపట నాటకం ఆడుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పాతగాని గోపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నాకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్‌లో 42 శాతం బీసీలకే చెందాలన్నారు. ఆ జాబితాలోని 10 శాతం ముస్లిం రిజర్వేషన్ తొలగించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ నాయకులు వేములకొండ సోమశేఖర్‌గౌడ్, బ్రహ్మచారి, మహంకాళి లక్ష్మణ్, అంబటి వెంకటచలం, రఘుపతిగౌడ్, ఆంజనేయులు, బాలకృష్ణ. అంజయ్య పటేల్, బొల్లం చంద్రమౌళి, పాదం వెంకటేశ్, తిరుపతయ్య పాల్గొన్నారు.

## సమష్టి సహకారంతోనే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన



**కుషాయిగూడ:** సమష్టి సహకారంతోనే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమని మల్కాజిగిరి డివిజన్ ముస్కాన్ టీం ఇన్‌స్పెక్టర్ పుల్లారెడ్డి అన్నారు. రాచకొండ మానవ అక్రమ నిరోధక విభాగం, కుషాయిగూడ డివిజన్ ముస్కాన్ టీం ఆధ్వర్యంలో చర్లపల్లి పారిశ్రామికవాడలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే వారిలో మానసిక, శారీరక రుగ్మతలకు దారితీస్తుందన్నారు. అంతేగాకుండా వారు అనారోగ్యం, చదువుకు దూరం కావడం వంటి ప్రతికూల ప్రభావం వారిపై ఉంటుందన్నారు. భావి భారత పౌరులను బాల కార్మికులుగా మార్చడం అనాగరిక చర్య అని అన్నారు. వారి హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ ఎన్‌జీఓలు సతీశ్, కాంతయ్య, రాపర్తి రఘు, కుషాయిగూడ ముస్కాన్ టీం ప్రతినిధులు పుల్లారెడ్డి, శ్యామ్, డీ సతీశ్, ఎల్లమ్మ, రజిత, జీ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ఉప్పల్:** ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. కే విజయకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి గాను వాణిజ్య శాస్త్రం (1), గణితం (1) పోస్టులకు అర్హులైన అభ్యర్థులకు 5వ తేదీ నుంచి ఉదయం 10.30 నుంచి ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డెమో, ఇంటర్వ్యూ పద్ధతి ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని నెట్, సెట్, పీహెచ్‌డీ గల వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 4న సాయంత్రం 4 గంటల్లోపు బయోడేటాతో పాటు సర్టిఫికెట్లను జత చేసి ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందించాలని సూచించారు.

## అడ్‌హక్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలి



అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

**మల్కాజిగిరి:** జీహెచ్‌ఎంసీ శానిటేషన్ అడ్‌హక్ కమిటీ సమావేశం వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మేయర్ శానిటేషన్ మెరుగుపరిచేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామని చెప్పిన మాటలు కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. మేయర్ నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతుందన్నారు. సీఎన్‌డీ సేవలు వినియోగించడం లేదని, ప్రైవేట్ సంస్థ రాంకీ సేవలు సరిగా లేకున్నా కోట్ల రూపాయలు చెల్లిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కమిటీ సమావేశం ఏర్పాటు చేసి తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# అధికారుల దృష్టికి ప్రజా సమస్యలు



కాలనీవాసులతో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

**మల్లాపూర్:** సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నానని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్ కుమార్ అన్నారు. ×బస్తీబాట« లో భాగంగా భవానీనగర్‌లో శుక్రవారం పర్యటించారు. కాలనీ కమాన్ వద్ద రెండేళ్ల ముందు బాక్స్ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేసినా మొదలు కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, బాక్స్ డ్రైన్ నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు పనులు ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో మల్లాపూర్ విద్యుత్ ఏఈ నాగరాజు, భవానీనగర్ కాలనీ సలహాదారులు శ్రీమన్నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేశ్, శ్రీనివాస్, పవన్, సురేశ్‌గౌడ్, రంజిత్, అశోక్, తదితరులు ఉ న్నారు.

## ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కృషి అభినందనీయం



నాగిరెడ్డి సంజీవరెడ్డి, ప్రెసిడెంట్

**కాప్రా:** చెరువుల పరిరక్షణ, సుందరీకరణకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని కాప్రా కాలనీస్ కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు నాగిరెడ్డి సంజీవరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని చెరువుల సుందరీకరణకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఎమ్మెల్యే కలిసి విజ్ఞప్తి చేయడం హర్షించదగిన విషయమన్నారు. నియోజకవర్గ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజానాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. కాప్రా చెరువుకు ప్రత్యేక చరిత్ర ఉందని, చెరువును కాపాడుకుంటూ దాన్ని భవిష్యత్ తరాలకు అలానే అందించేలా అందరూ కృషి చేయాలని కోరారు.

## 'కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి'



తెలంగాణ మానవ హక్కుల కమిషన్ కార్యాలయం వద్ద కార్పొరేటర్లు, నాయకులు

**గౌతంనగర్:** మల్కాజిగిరి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మల్కాజిగిరి నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు హైదరాబాద్ కోఠిలోని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో కమిషనర్‌ను శుక్రవారం కలిసి తమకు రక్షణకు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొంతకాలంగా పలువురు కాంగ్రెస్ నాయకులు తమపై దుష్ప్రచారం చేస్తూ తప్పుడు పోస్టులు సోషల్ మీడియాలో పెడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా బోనాల చెక్కుల పంపిణీ ఘటనలో తమపై దాడికి పాల్పడినవారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విన్నవించారు. అల్వాల్ పోలీస్‌స్టేషన్ పోలీసులకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మేకల సునీతా రాముయాదవ్, శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సబితాఅనిల్‌కిశోర్, నాయకులు రాముయాదవ్, అనిల్‌కిశోర్‌గౌడ్, బైరు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న కమిషనర్ శైలజ

**బోడుప్పల్:** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా 4వ డివిజన్‌లోని శ్రీలక్ష్మీనగర్ కాలనీలో నిర్వహించిన వన మహోత్సవంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ 6 మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటిన మొక్కలను సంరక్షించినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. వర్షాకాలం దృష్ట్యా నగర పాలక సంస్థ కార్యాలయంలో పని చేసే సిబ్బందికి కమిషనర్ శైలజ రెయిన్ కోట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈ చిరంజీవులు, ఏఈ రాకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

# 185 ఫ్లాట్లు.. రూ. 35 కోట్ల ఆదాయం

- స్వగృహ ఫ్లాట్ల కేటాయింపు
- నేడు సింగిల్ బెడ్రూం ఫ్లాట్లకు లాటరీ

**పోచారం:** రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ పోచారంలో నిర్మించిన సద్భావన టౌన్‌షిప్‌లోని డబుల్ బెడ్రూం ఫ్లాట్లను కేటాయింపునకు అధికారులు శుక్రవారం లాటరీ నిర్వహించారు. ఘట్‌కేసర్ తహసీల్దార్ రజని సమక్షంలో 185 మంది దరఖాస్తుదారులకు ఫ్లాట్లను కేటాయించారు. వీటి ద్వారా రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు సుమారు రూ. 35 కోట్ల మేర ఆదాయం వచ్చింది. డబుల్ బెడ్రూం ఫ్లాట్లలో మిగిలిన వాటికి శనివారం లాటరీ నిర్వహించనున్నారు. అదేరోజు సింగిల్ బెడ్‌రూం ఫ్లాట్ల కేటాయింపు కోసం కూడా లాటరీ తీయనున్నారు.

## కాప్రా సర్కిల్‌లో స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్‌లో డీసీ జగన్ నాయక్

**కుషాయిగూడ:** జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు కాప్రా సర్కిల్ అధికారులు కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి, కాప్రా, ఏఎస్‌రావునగర్ డివిజన్లలో ప్రీ మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల కురిసిన వర్షాలకు ఏర్పడిన ఇసుక మేటలు, పిచ్చి మొక్కల తొలగించారు. అలాగే పాడైన రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. ఖాళీ స్థలాల్లోని నీటి నిల్వలపై దోమల నివారణ మందు చల్లారు. అలాగే డిప్యూటీ కమిషనర్ జగన్‌నాయక్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అంటు వ్యాధులు, వ్యక్తిగత శుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈనెల 8 వరకు ఈ డ్రైవ్ కొనసాగుతుందని డీసీ తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ డీఈ బాలకృష్ణ, టౌన్ ప్లానింగ్ డీసీపీ కృష్ణమోహన్, దామోదర్‌రెడ్డి, గోపాల్, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్‌తో పాటుగా లోకేష్‌కుమార్, సర్వోత్తమ్‌రెడ్డి, ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్ మనుచౌదరి
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష




మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి



**సాక్షి,మేడ్చల్ జిల్లా:** వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్, రెవెన్యూ, వైద్య, విద్యా శాఖలు, తదితర జిల్లా అధికారులతో ప్రభుత్వ భూములు పరిరక్షణ, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఆరోగ్య కేంద్రాలు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు తమ పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి నివేదికలను అందించాలని ఆదేశించారు. 15వ ఆర్థిక కమిషన్ ద్వారా కేటాయించిన నిధులను వినియోగించుకొని జిల్లాలో ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు చేపట్టాలన్నారు. మురుగునీరు నిల్వకుండా, దోమల నివారణకు నిరంతరం పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ఫీవర్ సర్వేలు నిర్వహిస్తూ, ర్యాపిడ్ కిట్ల ద్వారా పరీక్షలు చేయాలని అధికారులకు సూచించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు సత్వరమే కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రైతులకు సబ్సిడీపై అందిస్తున్న ఎరువులు పక్కదారి పట్టకుండా, కొరత లేకుండా అందించేందుకు మండలస్థాయిలో అధికారులు ఫెర్టిలైజర్స్ షాపులను ప్రతి వారం తనిఖీ చేసి ఎరువుల నిల్వల స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించాలన్నారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్స్ పథకం కింద అర్హులై ఉండి 60 ఏళ్లలోపు మృతి చెందిన ప్రతి ఒక్కరికీ రూ. 20 వేల ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారు.

### వన మహోత్సవం లక్ష్యాన్ని సాధించాలి

జిల్లాలో వన మహోత్సవం లక్ష్యాన్ని ఖచ్చితంగా సాధించాలని అందుకనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దేశించిన వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో భూ భారతి ద్వారా స్వీకరించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్లమ్స్ ఏరియాలను గుర్తించి అక్కడ చిన్న చిన్న ఇళ్లలో ఉండేవారికి ప్రభుత్వం జీ ప్లస్ 3,4 అంతస్తుల్లో పక్కా ఇళ్లు నిర్మించేందుకు తగిన స్థలాలను గుర్తించి నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ హరిప్రియ, ఆర్డీఓలు ఉపేందర్ రెడ్డి, శ్యామ్ ప్రకాశ్, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



భూమి పూజలో పాల్గొన్న రవి

**బోడుప్పల్:** సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పీర్జాదిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి సూచించారు. 17వ డివిజన్ పరిధిలోని విష్ణుపురి కాలనీలో ఇందిరమ్మ ఇళ్లకు శుక్రవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంకా అర్హత ఉండి ఇళ్లు రాని వారు ఉంటే వారికి ఇస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ రేఖ, విష్ణుపురి కాలనీ అధ్యక్షుడు అమర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376
9912225470
9912220571